క్లుప్తంగా

ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్స్ ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ: బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఎస్జీటీలు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవడానికి స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో నాలుగు కంప్యూటర్లతో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఇప్పటికే ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు పూర్తయ్యాయని తెలిపారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్టీటీలు స్థానిక ఎంఆర్సీ కార్యాలయం, సమీప ఉన్నత పాఠశాలలో వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రమీల, వాసవి, పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్కు విద్యార్థి ఎంపిక


సంజన

నాగలాపురం: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) 2025 సంవత్సరానికి గాను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని బి.సంజన ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య తెలిపారు. సంజనకు 9, 10, 11, 12 తరగతులకు ప్రతి ఏడాది రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు అందుకుంటుందని తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ప్రముఖ న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నగరివీధిలోవున్న సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం వృద్ధులు, దివ్యాంగులు 35 కుటుంబాల వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు, సభ్యులు 161 నెలలుగా క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు బాబా ఫరీద్, హరినాథ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆగ్నేయ గణపతికి బాలాలయ పూజలు


పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ మూడో మాడవీధిలో ఉన్న ఆగ్నేయ గణపతి స్వామి ఆలయంలో ఆదివారం బాలాలయ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వర స్వామికి ప్రదోష పూజలు


సురుటుపల్లిలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డైరీ ఎండీ వాసుదేవ నాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి ప్రదోష నంది సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నందిపై అధిష్టింపజేశారు. ప్రాకారంలో ఊరేగించారు.

నిర్వీర్యం.. ఫ్యామిలీ వైద్యం

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకం తీసుకువచ్చారు. తండ్రి బాటలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు వైద్యానికి ఊపిరిపోశారు. అందులో భాగంగా ప్రజల వద్దకే వైద్యసిబ్బంది వెళ్లి సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టారు. 104 వాహనంలో పల్లెలకు వెళ్లి గ్రామస్తులకు చికిత్సలందించేలా పథకానికి రూపకల్పన చేశారు. మంచానికి పరిమితమైన వారి ఇళ్లకే వెళ్లి మందులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచింది. పేదలకు పైసా ఖర్చు లేకుండా సులభతరంగా సేవలందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌ను నిర్వీర్యం చేసేసింది.

- గ్రామీణులకు దూరమైన ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- పేదల ఇంటికే వెళ్లి చికిత్సలందించే పథకానికి తూట్లు
- మంచానికే పరిమితమైన రోగులకు తప్పని ఇబ్బందులు
- ఏడాదిగా పల్లెబాట పట్టని వైద్యులు
- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న ప్రజలు


ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించే 104 వాహనం

వరదయ్యపాళెం: ప్రజారోగ్య రక్షణను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. పల్లెవాసులకు అభయమిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పక్కన పెట్టేసింది. దీర్ఘకాలికి వ్యాధిగ్రస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి ముంగిటకే వస్తున్న మందులను దూరం చేసింది. షుగర్, బీసీ రోగుల వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసే మహోన్నత కార్యక్రమానికి చెల్లుచీటి రాసేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందనే ఒకే ఒక కారణంతో ప్రజలకు ఉపయోగపడే పథకానికి సైతం మంగళం పాడేసింది.

'సురక్ష'దీ అదే దారి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారు. నిపుణులైన వైద్యులతో 14 రకాల సేవలను గ్రామాల్లోనే శిబిరాలు పెట్టి మరీ అందించారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అక్కడికక్కడే మందులు అందజేశారు. అనారోగ్యం తీవ్రంగా ఉంటే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స నిమిత్తం సామాజిక, సర్వజనాసుపత్రులకు రిఫర్ చేసి చికిత్స అందించేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి.

అప్పులపాలవుతున్న జనం

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జ్వరం వస్తే ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ కష్టార్జితమంతా దారబోసుకుంటున్నారు. కొన్ని సేవలు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నప్పటికీ అత్యవసరంగా వైద్యం చేయాలని ప్రైవేటు ఆసుపత్రులవారు తొందర పెట్టడంతో వేలాది రూపాయిల అప్పులు చేసి చికిత్స చేయించుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేది. ఆరోగ్యశ్రీలో లేని వాటికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసి ఆదుకున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకల సంబంధిత రోగాలకు కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరోవైపు చాపకింద నీరులా కరోనా కేసులు పెరుగుతున్నాయి. వీటితో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వంటి వ్యాధులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టాలని డిమాండ్లు అధికమవుతున్నాయి.


గ్రామస్థాయిలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

అందని సేవలు



మంచంపై ఉన్న రోగులకు గతంలో సక్రమంగా వైద్య సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో వైద్యసేవలు అందించడం లేదు. జగనన్న హయాంలో ఇంటింటికి వచ్చి రోగుల కోసం సర్వే చేసి మందులను అందించేవారు.
–మంగమ్మ, సంతవేలూరు, వరదయ్యపాళెం మండలం

అవస్థలు పడుతున్నారు



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు ఫ్యామిలీ డాక్టర్ పథకం ఉపయోగకరంగా ఉండేది. ఇంటివద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసేవారు. తరచూ వచ్చి యోగక్షేమాలను తెలుసుకునేవారు. ఇప్పుడా వ్యవస్థ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.
–రమేష్, సత్యవేడు

పేదలకు ఇబ్బందులు:



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేశారు. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టులతో పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. ఇప్పుడు అవి లేకపోవడంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. –ఎతిరాజులు, కంచరపాళెం, వరదయ్యపాళెం మండలం

మందుల కోసం పాట్లు



గత ప్రభుత్వ హయాంలో మందులన్నీ మా ఇంటికే వచ్చి ఇచ్చేవారు. వైద్య సిబ్బంది ప్రతి వారం ఇంటికి వచ్చి తనిఖీలు చేసి మందులను అందించేవారు. ఇప్పుడు అరకొరగానే ఇస్తున్నారు. మిగతా మందుల కోసం పాట్లు తప్పడం లేదు.
–దయాకర్ రెడ్డి, కనవనంబేడు, బీఎన్‌కండ్రిగ మండలం

ఇంటికే వచ్చేవారు



జగనన్న ప్రభుత్వ హయాంలో వైద్యులు ఇంటికే వచ్చి రోగులకు వైద్యసేవలను అందించేవారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు.
–బాలకృష్ణ, వరదయ్యపాళెం మండలం

చిత్తశుద్ధి లేదు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలితే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందుకే ఎక్కడా వైద్య శిబిరాలు, ముందస్తు కరోనా పరీక్షలు వంటివి చేపట్టడం లేదు. ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.
– చిన్నిరాజ్, వరదయ్యపాళెం మండలం

రాచర్ల అంబేడ్కర్ క్రికెట్ టోర్నీ విజేతగా కారూరు

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్లలో నిర్వహించిన అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా సత్యవేడు మండలానికి చెందిన కారూరు జట్టు విజయం సాధించింది. ఆ మేరకు గత మే నెల 29న టోర్నమెంట్ ప్రారంభమైంది. 10 రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 30 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సత్యవేడు మండలానికి చెందిన కారూరు జట్టు, వరదయ్యపాళెంకు చెందిన కడూరు జట్లు తలపడ్డాయి. ఇందులో టోర్నమెంట్ విజేతగా కారూరు టీమ్ విజయం సాధించగా రన్నరప్‌గా కడూరు టీమ్ నిలిచింది. విజయం సాధించిన కారూరు జట్టుకు బండారి జయశంకర్ రెడ్డి, వంక మునిసుబ్బయ్యలు ప్రథమ బహుమతిగా రూ.30,116 అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కడూరు జట్టుకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్ర రూ.20,116ను అందజేయగా, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు బందిల సురేష్ క్రికెట్ కిట్లను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఆటగాడు జయశంకర్‌కు రూ.5.116ను జేసీబీ సురేష్ అందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి కింద రూ.2,116ను రాచర్లకు చెందిన మధు నాయుడు, మురళి నాయుడు అందజేశారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం చిన్న పాండూరు సర్పంచ్ శ్యామల సుబ్రమణ్యం రూ.5116ను అందించారు. టోర్నమెంటు నిర్వాహకులు రమేష్, గిరిప్రసాద్, ప్రతాప్, సురేష్, స్థానిక యువత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా రాజగోపుర కలశాల ప్రతిష్ట



ఆలయ రాజగోపురంపై కలశాలను ప్రతిష్టిస్తున్న అర్చకులు, ఆలయ రాజగోపురం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో పంచాహ్నిక నూతన రాజగోపుర కలశ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు నాగమురగప్ప మొదలి ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ రాజగోపుర కలశ ప్రతిష్టను కన్నుల పండువగా చేపట్టారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కలశాలను రాజగోపురంపై ప్రతిష్ఠించారు. తదుపరి సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ మేళత్తూరు లలితా కరుణాకరన్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం మొదలి తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించండి


కుప్పటతాగేలిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీ కుప్పటితాగేలిలో రోడ్డుపైనే మురుగునీరు చేరి అపరిశుభ్రంగా తయారైంది. ప్రధానంగా మురుగు కాలువలు లేని కారణంగా రోడ్డుకిరువైపులా మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కునుకులేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పునఃప్రారంభం కానున్న పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యా సామగ్రిని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పంపిణీ చేశారు.మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు 14,806, నోట్ పుస్తకాలు 16,210 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ విద్యా సామగ్రిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, రామచంద్రయ్య, సీఆర్పీలు ప్రసూన, ఈశ్వరమ్మ, కృష్ణయ్య, లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పద్మానగర్‌లో కార్డన్ సర్చ్


స్థానికులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

రేణిగుంట: మండలంలోని జీపాళెం పంచాయతీ పద్మానగర్‌లో ఆదివారం ఉదయం రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్, పోలీసులు కార్డన్ సర్చ్ చేపట్టారు. కాలనీలోని ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. తగిన ధ్రువీకరణ పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీ వాసులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

11 వాహనాలు సీజ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామంలో ఆదివారం ఉదయం ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బంది కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటి వద్దనున్న వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని 10 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రికార్డులు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రభాకర్, అనిల్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సిపాయి


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీకృష్ణ, ద్రౌపదీ ధర్మరాజులు స్వామి ఆలయ 51వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో తిరుపతి రష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం స్వయంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు

ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండాన్ని సిద్ధం చేసి వందలాది మంది భక్తులు కంకణాలు ధరించి, మడిస్నానాలను ఆచరించి పసుపు దుస్తులు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహిళలు అగ్ని స్నానాలు చేశారు. ఎలాంటి తోపులాటలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ ముని రంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు ముని కృష్ణారెడ్డి, హరిదాస్ రెడ్డి, యువత నాయకుడు మునిశేఖర్, కొంగర దాము, కొంగర శివ, పాతగుంట రవి, బాలాజీ, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని శ్రీకాళహస్తి మండలం ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి తెలిపారు. ఆయన ఆదివారం ఎర్రమరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, ఓబులాయిపల్లి గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 16 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌బాబు, లోకనాథ రెడ్డి, శ్రీనివాసులు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్, సీఆర్పీ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక


తులసి

ఏర్పేడు : పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికై నట్లు ఎంఈవో ప్రేమలత తెలిపారు. వారిలో మండలంలోని పల్లం ఉన్నత పాఠశాలకు చెందిన తులసి, పాపానాయుడుపేట బాపూజీ విద్యాసదన్‌కు చెందిన రెడ్డివారి జ్ఞానశ్రీ, వి.అభిషేక్, రావిళ్ల మమత, రెడ్డివారి ప్రతాప్‌రెడ్డి, ముజాహిత్, బి.రితిక ఉన్నారని తెలిపారు. వీరు సోమవారం తిరుపతి మహతిలో అవార్డు అందుకోనున్నట్టు తెలిపారు. విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

చెరువు కలుజు రక్షణ గోడ ధ్వంసం

అధికార పార్టీ నాయకుల అండదండలతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కుర్రకాలువ చెరువు కలుజు రక్షణ గోడను ధ్వంసం చేశారు. కట్టను తవ్వి, కలుజు కింద భాగంలో వారికి ఇష్టం వచ్చినట్టు పనులు చేస్తున్నారు. చెరువును కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే పెను ప్రమాదం కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు.

- యథేచ్ఛగా కలుజు కింద నిర్మాణ పనులు
- భారీ వర్షాలు కురిస్తే తప్పని ముప్పు
- ఇరిగేషన్ అధికారులు తీరుపై ఆరోపణల వెల్లువ


అక్రమార్కులు ధ్వంసం చేసిన కలుజు రక్షణ గోడ


చెరువు కట్టను తవ్వేసిన దృశ్యం

రేణిగుంట: మండలంలోని జీపాళెం పంచాయతీ కురకాలువ వద్ద పాపానాయుడుపేట-రేణిగుంట రోడ్డు సమీపంలో వున్న చెరువు కింద రియల్టర్లు వెంచర్ కోసం తమకు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. ఆదివారం చెరువు కలుజు రక్షణ గోడను ధ్వంసం చేశారు. కట్టను సైతం తవ్వి కలుజు కింద కాంక్రీట్ పనులు చేపట్టారు. రియల్టర్లకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు చెరువు వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇదే అదునుగా చేసుకున్న రియల్టర్లు తమకు అవసరమైన పనులను ఏమాత్రం నాణ్యత పాటించకుండా చేస్తున్నారు.

స్థానికుల భయాందోళన

గతంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువు కలుజు ప్రవహించిన వరద నీరు పెద్ద ఎత్తున పాపానాయుడుపేట-రేణిగుంట రోడ్డును ముంచెత్తింది. వాహనాలు సైతం వెళ్లలేని స్థితి నెలకొంది. కలుజుకు అడ్డంగా ఎలాంటి కట్టడాలు లేని సమయంలోనే అలా ఉంటే ఇప్పుడు వరద నీరు వెళ్లేందుకు దారి లేక పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు వాపోతున్నారు. రియల్టర్లు వెంచర్లు వేసి ప్లాట్లు అమ్ముకొని వెళ్లిపోతారని, స్థానికంగా ఉన్న తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ ఉన్నత అధికారులు చొరవ తీసుకొని అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని కోరుతున్నారు.


కలుజు కింద జరుగుతున్న నాసిరకం కాంక్రీట్ పనులు